పట్టుబడితే తుక్కే..!

- ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో తుప్పుపడుతున్న వాహనాలు
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడవుతున్న వైనం



సచివాలయాల ముందు నిలిపిన కార్లు, బైక్‌లు



ఆరిలోవ పోలీస్ స్టేషన్ పక్కన, వెనక నిలిపిన వాహనాలు

ఆరిలోవ: ప్రమాదాలు కావచ్చు.. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపటం కావచ్చు.. కారణం ఏదైనా పోలీసులకు పట్టుబడిన వాహనాలు స్టేషన్‌లో తుప్పుపట్టిపోతున్నాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఆవరణం ఇలాంటి వాహనాలతో నిండిపోయింది. ఏళ్ల తరబడి ఇక్కడ వాహనాలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఇక్కడ స్థలం చాలకపోవడంతో పోలీసులు ఎక్కడపడితే అక్కడ వాటిని నిలిపేస్తున్నారు. పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడిన ఈ వాహనాలకు ఇక్కడి ఖాళీ స్థలాలు పార్కింగ్‌గా మారిపోయాయి. అసలే ఈ స్టేషన్ చిన్నది. ఓ గదిని మూడు భాగాలుగా చేసి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కొందరు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఇక్కడికి ఫిర్యాదులు ఇవ్వడానికి, కేసులు వ్యవహారాలు గురించి వచ్చిన వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. వారంతా ఇక్కడ ఉన్న ఇరుకు గదిలోనే ఉండాలి. ఇదిలా ఉండగా ఈ స్టేషన్‌కు ఖాళీ స్థలం కూడా లేదు. దీంతో ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి గురైె పోలీసులకు పట్టుబడిన వాహనాలు, రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలను పోలీసులు తీసుకొచ్చి స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఉంచుతున్నారు. అంత వరకు బాగానే ఉంది. ఆ నిలిపిన వాహనాల వల్ల స్టేషన్ వెనక ఉన్న మూడు సచివాలయాలకు వెళ్లేందుకు ప్రజలకు దారి లేకుండా పోయింది. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి విశాలమైంది. అటు రుషికొండ నుంచి ఎండాడ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, ఇటు హనుమంతవాక నుంచి డెయిరీఫారం, ఆరిలోవ పెదగదిలి, చినగదిలి, పైనాపిల్ కాలనీ, దారపాలెం వరకు పరిధి ఉంది. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు గురైన వాహనాల సంఖ్య ఇక్కడ పెరిగిపోతుంది.

సచివాలయాలకు దారిలేదు..

ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన కార్యాలయం, 12వ వార్డుకు చెందిన 1, 2, 21 నంబరు గల మూడు సచివాలయాలు ఈ పోలీస్ స్టేషన్ వెనక ఉన్నాయి. ఆయా సచివాలయాలకు పోలీస్ స్టేషన్ పక్క నుంచి మార్గం ఉంది.

ఆ స్థలమంతా వాహనాలతో నిండిపోవడంతో పాటు సచివాలయాలు ముందు కూడా కార్లు, ఆటోలు నిలిపేశారు. సచివాలయం సిబ్బంది సైతం తమ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడానికి వీల్లేకుండా పోయింది. దీంతో ఈ కార్యాలయాలకు తనిఖీ కోసం వచ్చిన అధికారులు తమ వాహనాలను కూడా స్టేషన్ ముందు ప్రధాన రహదారి పైనే నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు ఏడు సంవత్సరాల నుంచి పలు కేసుల్లో సీజ్ చేసిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇక్కడ తుప్పు పట్టిపోతున్నాయి. వీటిలో సగం కంటే ఎక్కువ వాహనాలు భాగాలు పాడైపోయాయి. పోలీస్ స్టేషన్ ఆవరణం అంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. ఇక్కడ సుమారు 150కి పైగా వాహనాలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి తుప్పుపట్టిన వాహనాలకు మోక్షం కలిగించాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలకు వేళాయెె



తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులు(ఫైల్)

ఆరిలోవ: వేసవి సెలవులు బుధవారంతో ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నిజానికి బుధవారం పాఠశాలలు పునఃప్రారంభించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగడంతో సెలవులు మరో రోజు పొడిగించారు. దీంతో విద్యార్థులు గురువారం నుంచి పుస్తకాలు సంచి బుజాన వేసుకొని పాఠశాలలకు వెళ్లాల్సిందే. తూర్పు నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. ఎప్పటిలాగే పాఠశాలలు కళకళలాడనున్నాయి. పాఠశాల క్రీడా మైదానాలు పిల్లల ఆటలతో సందడిగా మారనున్నాయి. నియోజకవర్గంలో ఆరిలోవ, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, చినవాల్తేరు, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం వరకు 25 ప్రభుత్వ పాఠశాలలుతో పాటు మరో 50 కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 12,000 మంది విద్యార్థులు చదువుతుండగా, సుమారు మరో 40,000 మంది వరకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఇప్పటికే ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లు, బ్యాగులు తదితర కిట్లను విద్యాశాఖాధికారులు సిద్ధం చేశారు. ఎప్పటిలాగే ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఉచిత యోగా శిబిరం ప్రారంభం



చినగదిలి సాయిబాబా ఆలయంలో యోగా చేస్తున్న అభ్యాసకులు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరాన్ని ఆలయ చీఫ్ సెక్రటరీ ఆర్.ఎ.పాత్రో ప్రారంభించారు. యోగాచార్యుడు బుద్దిగ సత్యనారాయణ అభ్యాసకులకు శిక్షణ ఇచ్చారు. యోగాసనాలతో పాటు ధ్యానం, ముద్రలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ ఈ శిబిరం ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో చినగదిలి, సాలిపేట, సంతపేట, ఆరిలోవ కాలనీ తదితర ప్రాంతాల నుంచి అభ్యాసకులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ

మహారాణిపేట: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు–2016పై మాధవధారలో గల కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానా కట్టవలసి ఉంటుందన్నారు. తడి–చెత్త పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్ఆర్‌కే రావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అదనపు ఎగ్జికూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీరామ చంద్రమూర్తి, పోర్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీవీఎస్‌టీ మూర్తి, జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.సతీష్, అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుట్ట బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం

సీతంపేట : అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో కొలువైన పుట్ట బంగారమ్మ, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ శర్మ స్వామి వారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ జరిపారు.

ఉక్కు కార్మికుల జీతాలు చెల్లించాలి



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు ఈ నెలలో అయినా సకాలంలో చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్షా శిబిరంలో బుధవారం ఆయన మాట్లాడారు. జీతాల చెల్లింపునకు యాజమాన్యం ఇచ్చిన మాటను ఈ సారైనా నిలబెట్టుకోవాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఉక్కు రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్ని హీనస్థితికి తీసుకెళ్లిందని ఆరోపించారు. ఈ దుస్థితికి కారణమైన ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, ఆంధ్ర రాష్ట్రానికి అతిపెద్ద దిక్కుగా ఉన్న ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోసేందుకు సంకీర్ణ ప్రభుత్వ పెద్దలు కృషి చేయాలని కోరారు. దీక్షా శిబిరంలో ఎస్ఎంఎస్ – 2 విభాగ కార్మికులు, నాయకులు డి.ఆదినారాయణ, రమణమూర్తి, నరేంద్ర, భాస్కరమూర్తి, మాణిక్యాలరావు, మరిడయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

అనాథ బాలలకు ఎంబీఏ విద్యార్థుల చేయూత

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన విద్యార్థులు సామాజిక సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విశాఖ పరిధిలోని 7 అనాథాశ్రమాలకు చెందిన 195 మంది బాలలను కళాశాలకు బుధవారం తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త తరుణ్‌కుమార్ మాట్లాడుతూ అనాథాశ్రమాల్లోని ఇబ్బందులను గుర్తించి వారికి సహకారం అందించేందుకు ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. వైద్య సేవలు అందించిన వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆశ్రమాల్లోని బాలలు ఆరోగ్యం, దంతాలను పరిరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ' అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జనం జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రయోగశాలిగా, పదునైన విమర్శకుడిగా శ్రీశ్రీ వినుతికెక్కాడని అన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ముందుగా ఇటీవల దివంగతులైన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎస్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సి.హెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ వద్ద చేనేత హస్తకళా హ్యాండ్‌లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రదర్శనను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. నిర్వాహకుడు సింహాద్రి సురేష్ ఆధ్వర్యంలో వుడా కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 28 వరకు నిర్వహిస్తామని నిర్వాహకుడు తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల చేనేత వస్త్రాలు, హ్యాండీ క్రాఫ్ట్స్ అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింహాద్రి సురేష్ తెలిపారు.

పక్కాగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి



తోటగరువు పుస్తకాల కేంద్రంలో పాఠ్య పుస్తకాలు రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్



కేంద్రంలో పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ: చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్ట్‌లు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈవోలను ఆదేశించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని ఆయన విద్యా విభాగం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. చినగదిలి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు వచ్చాయా? లేదా? తదితర వివరాల గురించి ఎంఈవోల ద్వారా తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలు కిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పుస్తకాల కిట్లను జాగ్రత్తగా మండలంలో అన్ని పాఠశాలలకు పంపిణీ జరిగేటట్లు ఎంఈవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలో 72 పాఠశాలల్లో 13,148 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో ప్రస్తుతం 83 శాతం మందికి పాఠ్య పుస్తకాలు రాగా, 100 శాతం మందికి సరిపడా నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షూలు 80 శాతం, బెల్టులు 55 శాతం మందికి సరిపడా వచ్చినట్లు తెలిపారు. ఇంకా యూనిఫారం రాలేదని, కొద్ది రోజుల్లో రానుందని, వచ్చిన వెంటనే సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల కిట్లు పంపిణీ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన, ఎంఈవో–1 రవీంద్రబాబు, ఎంఈవో–2 అనురాధ, భవిత కోఆర్డినేటర్ గీత, పీఎంవో అప్పలనాయుడు, పీఆర్పీలు అప్పలరాజు, రాంబాబు, మండల కో–ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

శరవేగంగా ఆయుష్మాన్ ఆస్పత్రి పనులు



విమ్స్ ఆవరణలో చేపడుతున్న ఆయుష్మాన్ ఆస్పత్రి నిర్మాణం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో చేపట్టిన ఆయుష్మాన్ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి కోసం విమ్స్ ఆవరణలో ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ 50 పడకలతో ఈ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో పనులు ప్రారంభించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. విమ్స్‌లో ఇప్పటికే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఆయుష్మాన్ ఆస్పత్రి కూడా అందుబాటులోకి వస్తే మరింత ఎక్కువ మందికి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని నగరవాసులు ఆశిస్తున్నారు. వైద్యాధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో పార్కింగ్‌తో కష్టాలు



రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనం

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ బజార్ ప్రాంతంలో పలు వాహనాలను రోజూ రోడ్డు మధ్యలో పార్కింగ్ చేయడంతో మిగతా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందవుతోంది. ఇదే విషయమై స్థానికులు ఆయా వాహనాల యాజమానులకు చెప్పినా వినిపించుకోవడం లేదని, మళ్లీ అదే స్థలంలో పార్కింగ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ సిబ్బంది, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వాహనాలను తొలగించాలని కోరుతున్నారు.

వైభవంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



అనఘా లక్ష్మీ వారాహీ సహిత రాజశ్యామల అమ్మవారు



లక్ష పుష్పార్చనకు సిద్ధం చేస్తున్న పువ్వులు

డాబాగార్డెన్స్: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన అనఘా లక్ష్మి, వారాహి సహిత రాజశ్యామల అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ సాయిదర్బార్ ప్రాంగణంలో గల అమ్మవార్ల సన్నిధిలో ఆలయ అర్చకులు శైవాగమ రీతిలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మహాలక్ష్మి హోమం జరిపారు. మహిళలు, భక్తులు సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణ చేశారు. అర్చకుల వేద పఠనంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద ఎత్తున స్థానికులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీసాయి మేరు ట్రస్ట్ చైర్మన్ పీఎస్‌వీజీ ప్రసన్న, కార్యదర్శి పి. శ్రీనివాస శాస్త్రి, జి. రమ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి. సతీష్, ఎ. రామ్‌రాజ్, డాక్టర్ కె. వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్, స్వంతన సేవా సమితి సంయుక్తంగా ముద్రించిన ×బాలల హక్కులు.. చట్టాలు÷పుస్తకావిష్కరణ సభ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమే అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను సమస్యగా కాకుండా సవాలుగా చూడాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని నిజాయితీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన లోపం వల్ల విద్యార్థులు బాలకార్మికులుగా మారుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యదర్శి డాక్టర్ సత్యమూర్తి, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణా కళాశాలలో మెగా జాబ్ మేళా రేపు



జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన బుధవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ నాలెడ్జ్ సెంటర్, మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ సంయుక్తంగా ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. 25 కంపెనీలు పాల్గొనే ఈ జాబ్ మేళాను డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యానికి ఈ మూడు తప్పనిసరి

బీచ్‌రోడ్డు : గుండె ఆరోగ్యానికి రోజువారి ఆహారంలో తప్పనిసరిగా మూడు ఆహార పదార్థాలు చేర్చాల్సి ఉందని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి తెలిపారు. బుధవారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ చాలా మంది తమ గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపే ఒత్తిడి జీవితాలు గడుపుతున్నారన్నారు. మెరుగైన గుండె ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన అనేక ఆహార పదార్థాలలో ముఖ్యంగా బాదం, వెల్లుల్లి, ఓట్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనేక అధ్యయనాలు వీటిని బలపరిచాయని గుర్తు చేశారు.

వీధి లైట్లు వెలిగించరూ..



మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో వీధిలైట్లు మరమ్మతుకు గురై చీకట్లు అలుముకున్నాయని, వెంటనే మరమ్మతు చేసి వీధిలైట్లు వెలగించాలని కాలనీవాసులు కోరారు. కేఆర్ఎం కాలనీలోని డోర్ నంబర్ 53–36–3/1 ఇంటి ఎదురుగా వున్న 41/బి10/1 పోల్ నంబర్‌కు సంబంధించిన వీధిలైట్లు గత 15 రోజులుగా వెలగడం లేదని పేర్కొన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేయగా.. అమ్మవారిని పసుపు కుంకుమలు, పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.